నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కండ్లకోయ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ విజయ్‌కుమార్ తెలిపారు. కండ్లకోయ, సుతారిగూడ, రైల్వేట్రాక్ రోడ్డు, ఔటర్ సర్వీస్ రోడ్డు, కండ్లకోయ ప్రధాన రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మర్యాదపూర్వక కలయిక



ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

జవహర్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతమ్‌ను మంగళవారం జవహర్‌నగర్ కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం పలు విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పత్తి కుమార్, ఎస్సీసెల్ జిల్లా కన్వీనర్ సునీత, జవహర్‌నగర్ కార్పొరేషన్ ఎస్సీసెల్ చైర్మన్ సాయి కిరణ్, ఎస్సీసెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్, తిమోతి, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రశీదుతో మోసం.. కేసు నమోదు

పోచారం: నకిలీ రశీదుతో ఓ వ్యక్తి మోసపోయిన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. చౌదరిగూడలోని రేణుకాఎల్లమ్మ కాలనీకి చెందిన రామకృష్ణారెడ్డి (44) బస్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మార్చి 25న రిలయన్స్ ఇన్సురెన్స్ కంపెనీలో పనిచేస్తున్నట్లు ఓ వ్యక్తి వచ్చి బీమా పాలసీ గడువు ముగుస్తుందని, పేమెంట్ చెల్లించకపోతే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని చెప్పాడు. దీంతో అతడిని నమ్మి రూ. 31,198 గుజ్జరి శివ ప్రసాద్ అకౌంట్‌కు రామకృష్ణారెడ్డి ఫోన్‌పే చేయగా.. రశీదును వాట్సాప్ ద్వారా పొందాడు. రెండ్రోజుల తర్వాత పాలసీ పేమెంట్ రాలేదని ఇన్సూరెన్స్ కంపెనీ హెడ్ ఆఫీస్ నుంచి ఫోన్ రాగా.. మరుసటి రోజు సికింద్రాబాద్‌లోని ఇన్సూరెన్స్ ఆఫీస్‌కు వెళ్లి రశీదు చూయించాడు. అది నకిలీదని, సదరు వ్యక్తి కంపెనీలోని ఉద్యోగి కాదని తేలడంతో బాధితుడు మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనర్హులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై నిరసన

మేడ్చల్: పట్టణంలోని 11వ వార్డులో అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని ఆరోపిస్తూ స్థానికులు మంగళవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. వార్డు పరిధిలో చాలా మంది అర్హులకు ఇళ్లు కేటాయించకుండా అనర్హులకు కేటాయించారని ఆరోపించారు. అధికారులు ఇప్పటికైనా సమగ్ర విచారణ చేపట్టి అర్హులకే ఇళ్లు ఇవ్వాలన్నారు.

బ్యాంకును మోసం చేసిన వ్యక్తి రిమాండ్



అభిలాష్‌రెడ్డి

మేడిపల్లి: ఓ ఫైనాన్స్ సంస్థను బురిడి కొట్టించడమే కాకుండా ఓ మాజీ సర్పంచ్‌కు కుచ్చుటోపి పెట్టి రూ. 40 లక్షలు కాజేసి, తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బోడుప్పల్ జ్యోతినగర్‌కు చెందిన అభిలాష్‌రెడ్డి (36) బంగారం వస్తువులను ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.5,35,000లకు తాకట్టులో ఉన్నాయని, రిలియంట్ క్రెడిట్స్ లిమిటెడ్ బ్యాంకుకు వెళ్లి, తాకట్టు పెట్టిన బంగారాన్ని స్వాధీనం చేసుకుని బ్యాంకులో పెట్టుకోవాలని సంప్రదించగా.. బ్యాంకు వారు ముత్తూట్‌కు సంబంధించిన రశీదులు, గుర్తింపుకార్డులను పరిశీలించి ఏప్రిల్ 25న రూ.5,35,000లను అభిలాష్‌రెడ్డి అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. తర్వాత ప్రాసెస్ కోసం ముత్తూట్ ఫైనాన్స్‌కు వెళ్లగా సాంకేతిక కారణాల వల్ల ప్రాసెస్ కాలేదని తెలుసుకున్న రిలియంట్ క్రెడిట్స్ లిమిటెడ్ బ్యాంక్ వారు తిరిగి అభిలాష్‌రెడ్డి డబ్బులు వాపస్ ఇవ్వాలని అడగగా.. ఫేక్ ట్రాన్స్‌ఫర్ స్క్రీన్ షాట్‌ను బ్యాంక్ వారికి చూపించాడు. డబ్బులు బ్యాంక్‌లో జమకాలేదని మరోసారి సంప్రదించగా అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నాడు. దీంతో సదరు బ్యాంక్ అధికారులు మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడు ధరణి పోర్టల్‌లో పహాణీలోని తప్పులను సరిచేసి పట్టా పాస్ బుక్ ఇప్పిస్తానని రూ. 40లక్షలు కాజేసిన కేసులో నిందితుడని పోలీసులు తెలిపారు.

సరదా కారాదు.. కడుపు కోత !

- సెలవుల్లో ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న విద్యార్థులు
- హెచ్చరిక బోర్డులు, కంచెలు, రక్షణ ఏర్పాట్లు కరువు



మల్కారం చెరువులో మృతిచెందిన విద్యార్థులు, ఉపాధ్యాయుడు (ఫైల్)

ఘట్‌కేసర్: వేసవిసెలవులు రావడంతో స్కూల్ నుంచి కళాశాలల వరకు సెలవులు ఉండటంతో విద్యార్థులు సరదా వైపు మక్కువ చూపుతారు. స్నేహితులతో కలిసి ఆహ్లాదకరమైన వాతావరణం, ప్రకృతి అందాలు తిలకించడానికి ఇష్టపడుతుంటారు. కుటుంబసభ్యులు పనిలో నిమగ్నమై ఉండటంతో వారిని పర్యవేక్షించడం లేదు. దీంతో ఈత కోసం చెరువులు, కుంటలు, క్రషర్ గుంతల చెంతకు వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారు. ఫెన్సింగ్ లేకపోవడం, లోతు గురించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదం గురించి అవగాహన లేకుండా పోతోంది.చెరువుల్లోని గుంతలో అడుగుపడగానే మునిగిపోవడం చూసి గట్టున ఉన్న స్నేహితులు అరవడం, సమీపంలో ఉన్నవారు వచ్చేలోపే ప్రాణాలు గాలిలో కలుస్తుడటం క్షణాల్లో జరిగిపోతున్న ఘటనలు అనేకం ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రధానంగా మేడ్చల్, శామీర్‌పేట్ పెద్ద చెరువు, ఏదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువు, చీర్యాల్, కీసర పెద్దమ్మ చెరువు, జవహర్‌నగర్ మల్కారం చెరువు, క్రషర్ గుంతలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వేసవిలో చెరువులు, కుంటల వద్ద ఈత సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం...

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- చెరువులు, కుంటల వద్ద లోతు వివరాలతో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గతంలో జరిగిన ప్రమాదాలు వాటిపై రాయాలి.
- పిల్లలను ఒంటరిగా పర్యటక ప్రాంతాలకు వెళ్లనివ్వకూడదు. జలాశయాలు, చెరువుల్లో సెల్ఫీ దిగడం, ఈదడం నిషేధించాలి.
- నీటి ప్రవాహాలు, చెరువుల్లోకి అనుమతి ఇవ్వరాదు. ప్రమాదాలు జరిగే స్థలాల్లో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.
- తల్లిదండ్రుల పర్యవేక్షణలోనే ఈత నేర్పించాలి. ప్రతీ ఈత కొలనులో శిక్షకుడిని కచ్చితంగా నియమించాలి.

ఈతకు వెళ్లి ప్రాణాల మీదకు..

గతంలో స్నేహితులతో కలిసి సరదా కోసం శామీర్‌పేట్ పెద్ద చెరువులో సఫీల్‌గూడకు చెందిన ఇద్దరు, స్నేహితుడి జన్మదిన వేడుకల కోసం చీర్యాల్ చెరువులో మునిగి పీకేఆర్ హుయత్‌నగర్ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు మరణించారు. కీసర గుట్ట చెరువులోకి దిగి ఈతరాక శామీర్‌పేట్‌కు చెందిన ఓ విద్యార్థి మృత్యువాత పడ్డాడు. జవహర్ నగర్ మల్కారం చెరువులో దిగి ఈత రాక ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు.

కుటుంబ సభ్యులతోనే రక్షణ



పిల్లలు ఈత నేర్చుకునే సమయంలో కుటుంబ సభ్యులు కచ్చితంగా వెంట ఉండాలి. సాధ్యమైనంత వరకు ఈత కొలనులోనే ఈత నేర్పించాలి. తల్లిదండ్రులు, కుటుంబసభ్యుల దగ్గర లభించిన రక్షణ ఎవరివద్ద లభించదు. వారిని ఒంటరిగా వెళ్లనీయకూడదు.

–పరశురాం, ఇన్‌స్పెక్టర్ ఘట్‌కేసర్

స్నేహితులతో పంపొద్దు



స్నేహితులతో కలిసి ఈతకు తమ పిల్లలను పంపకూడదు. ప్రమాదం జరిగిన సమయంలో అరవడం తప్పా వారేమి చేయలేరు. ముందుకెళ్లినా ఎలా రక్షించాలో తెలియక అందరూ నీటిలో మునిగిపోతారు. ఈ విషయంపై తల్లిదండ్రులే జాగ్రత్తగా ఉండాలి.

– బద్దం గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఘనాపూర్

కోచ్ ఉంటేనే ఈత నేర్పించాలి



తరచుగా ప్రమాదాలు జరుగుతున్నా విద్యార్థులకు అవగాహన రావడం లేదు. చెరువు కనిపించగానే లోతు తెలుసుకోకుండా చెరువుల్లోకి దిగి చనిపోతున్నారు. కోచ్ ఉన్న కొలనులోనే ఈత నేర్పించాలి. ప్రమాదమని తెలిస్తే ఈతను విరమించుకోవాలి.

–ఎం. శ్రీనివాస్‌రెడ్డి, అవుషాపూర్ వీబీఐటీ ఫిజికల్ డైరెక్టర్

కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులు

కీసర: భూభారతి పైలట్ ప్రాజెక్ట్ రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం మేడ్చల్, మల్కాజ్‌గిరిజిల్లా కీసర మండలం యాద్గార్‌పల్లి ఈస్ట్, వెస్ట్, తిమ్మాయిపల్లి గ్రామాల్లో రెవెన్యూ అధికారులు సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా యాద్గార్‌పల్లి ఈస్ట్‌కు 96, వెస్ట్‌కు 85, తిమ్మాయిపల్లిలో 34 దరఖాస్తులను అందించినట్లు మేడ్చల్ జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, కీసర ఆర్డీవో వెంకటఉపేందర్‌రెడ్డి, కీసర తహసీల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు ఎక్సైజ్ స్టేషన్‌లో వాహనాల వేలం

పోచారం: నారపల్లిలోని ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్‌లో సీజ్‌చేసిన 8 వాహనాలను బుధవారం ఉదయం 11 గంటలకు వేలం వేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవి తెలిపారు. ఇతర వివరాలకు 8712658736, 9642377661, 9640097624.

తైబజార్ వేలం వాయిదా

పోచారం: మున్సిపాలిటీ కార్యాలయంలో తైబజార్ వేలం వాయిదా పడింది. దీంతో మంగళవారం మున్సిపల్ షాపులు, ఫంక్షన్ హాళ్ల వేలంపాటను వాయిదా వేశారు. ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాకపోవడంతో వాయిదా వేసినట్లు మున్సిపల్ సిబ్బంది ప్రకటించారు. తదుపరి తేదీని త్వరలో ప్రకటిస్తామని వివరించారు.

అర్హులందరికీ లబ్ధి చేకూరాలి

- రాజీవ్ యువ వికాసం పథకంపై..
- మేడ్చల్, మల్కాజిగిరి కలెక్టర్ గౌతమ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: అర్హులైన ప్రతి ఒక్కరికి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లబ్ధి చేకూరేలా దరఖాస్తులను పరిశీలించాలని సంబంధిత అధికారులకు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. మండలాలు, పురపాలక సంఘాల వారీగా వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటి వరకు పరిశీలించిన వాటిపై ఆయన ఆరా తీశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా సంక్షేమ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో రాజీవ్‌యువవికాసం పథకంపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం యువతకు స్వయం ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తులను శ్రద్ధగా పరిశీలించాల్సిన అవశ్యకతను వివరించారు. ఎంపికైన దరఖాస్తుల సెలక్షన్ లిస్టులను వెంటనే పంపాలని అధికారులకు సూచించారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను కలెక్టర్ దృష్టికి పలువురు అధికారులు ,కమిషనర్లు తీసుకురాగా.. అవసరమైన సలహాలను సూచనలను కలెక్టర్ సూచించారు. దరఖాస్తుల ఎంపిక ప్రక్రియలో పూర్తి బాధ్యత అధికారుల దేనని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై..

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సంబంధిత అధికారులతో కలెక్టర్ గౌతమ్ మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జెడ్పీ సీఈఓ కాంతమ్మ, డీఆర్డీఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి వినోద్ కుమార్, బీసీ సంక్షేమశాఖ అధికారి ఝాన్సీరాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోసిస్, హౌజింగ్ ఈడీ రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు త్రిలేశ్వర్‌రావు, వీరారెడ్డి, నాగిరెడ్డి, నాగమణి, వెంకట్‌గోపాల్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఎస్వీ నాయక్, సాబేర్‌అలీ, శైలజ, చంద్రశేఖర్, ఎల్డీఎం, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి, ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సెలవులొచ్చినా.. ఇంటికి సరుకులు !

31 వరకు అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు

- లబ్ధిదారుల ఇంటికే సామగ్రి
- జిల్లాలో 793 కేంద్రాలు..
- 1.07 లక్షల మంది లబ్ధిదారులు

సాక్షి,సిటీబ్యూరో: ఎండలు పెరగడంతో అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం వేసవి సెలవులు ప్రకటించింది. సిబ్బంది విధులపై మాత్రం కొన్ని షరతులతో కూడిన సెలవులను మంజూరు చేసింది. నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఈనెల 1 నుంచి 31 వరకు సెలవులు ప్రకటించారు. జూన్ 1 నుంచి కేంద్రాలు యథావిధిగా పనిచేయనున్నాయి.

- జిల్లాలో 34 సెల్సియస్ డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పటికే 35 సెల్సియస్ డిగ్రీలు దాటిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో 793 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా.. ఇందులో 6 నెలల నుంచి ఆరేళ్ల పిల్లలు 90.361 మంది, గర్భిణులు, బాలింతలు 17,123 మంది ఉండగా.. మొత్తంగా 1,07,484 మంది ఉన్నారు.
- కుత్బుల్లాపూర్ ప్రాజెక్టు పరిధిలో 311 కేంద్రాలు ఉండగా.. 47.028 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు, మేడ్చల్‌లో 211 అంగన్‌వాడీ కేంద్రాల్లో 39,463 మంది, ఆల్వాల్ పరిధిలో 271 అంగన్‌వాడీ కేంద్రాల్లో 20,993 మంది పిల్లలు, గర్భిణులు, బాలింతలు ఉన్నారు.

అద్దెలు తక్కువగా ఉండటంతో..

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వం చెల్లించే అద్దెలు తక్కువగా ఉండటంతో ఇరుకు గదుల్లో నడిపించాల్సిన దుస్థితి నెలకొంది. జిల్లాలోని చాలా వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్స్ తదితర కనీస సదుపాయాలు కూడా లేవు.

- జిల్లాలోని 117 కేంద్రాల్లో తాగునీటి సమస్య ఉండగా.. 118 కేంద్రాల్లో శానిటేషన్ సమస్య ఉంది. సొంత భవనాలు లేనివి 443 కేంద్రాలు ఉన్నాయి.
- 443 అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఇవి కాకుండా దాతలు ఉచితంగా ఇచ్చిన 138 భవనాల్లో కూడా అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటన్నింటి నేపథ్యంలో ప్రభుత్వం సెలవులు ప్రకటించింది.

సిబ్బంది సేవలు యథాతథం..

అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవులు ప్రకటించినప్పటికీ టీచర్లు, ఆయాలు సేవలు మాత్రం యథావిధిగా నిర్వహించాలని ప్రభుత్వం జీవోలో పేర్కొంది. సెలవుల్లో చెరో 15 రోజులు కేంద్రాల వద్ద పనిచేయాల్సి ఉంటుంది. ఈనెల 15 వరకు అంగన్‌వాడీ టీచర్లు, 16 నుంచి 31 వరకు ఆయాలు కేంద్రాల పరిధిలో ఉండి పౌష్టికాహారం పంపిణీ చేయాలని పేర్కొంది.

- ఆయా కేంద్రాల పరిధిలో టీచర్లు ఇంటింటి సర్వే నిర్వహించి పిల్లలను ప్రీస్కూళ్లలో చేర్పించడం, బడి బయటి పిల్లలను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించాల్సి ఉంటుంది. ఐదేళ్ల లోపు చిన్నారులు ఎత్తుకు తగిన బరువు, ఎదుగుదలకు సంబంధించిన వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. సంబంధిత విధులు నిర్వహిస్తున్నప్పటికీ, లబ్ధిదారుల ఇళ్లకు మాత్రం సరుకులు అందేలా చూస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు సంక్షేమం, అభివృద్ధిశాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

రైల్వేను ప్రైవేట్‌పరం చేయొద్దు



మేడ్చల్ రైల్వే స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేట్ పరం చేస్తే ప్రజల ఆగ్రహాన్ని చూడక తప్పదని సీఐటీయూ నాయకులు అన్నారు. మంగళవారం మేడ్చల్ రైల్వేస్టేషన్ ఎదుట రైల్వే రంగాన్ని ప్రైవేట్‌పరం చేయొద్దంటూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వందే భారత్ వంటి ఖరీదైన రైళ్లలో పేదవాడికి రైలు ప్రయాణం దూరం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వేను ప్రైవేట్ పరం చేస్తే సీఐటీయూ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తుందన్నారు. ధర్నాలో మండల సీఐటీయూ కన్వీనర్ నరేష్, మండల నాయకులు నర్సింగ్‌రావు, ప్రశాంత్, రమేష్, కొమురయ్య, ప్రేమలత, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సిబ్బందికి జీతాలు చెల్లించాలి

కీసర: నాగారం మున్సిపల్ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతాలు చెల్లించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం పురపాలక సంఘం శాఖ కమిషనర్, సలహాదారులు డైరెక్టర్ టీకే శ్రీదేవికి వారు వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ పరిధిలోని వివిధ కాలనీలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. దీనిపై అధికారిణి సానుకూలంగా స్పందించినట్లు చంద్రారెడ్డి తెలిపారు.



పురపాలక సంఘం శాఖ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న మాజీ చైర్మన్ చంద్రారెడ్డి

నృత్య పోటీల్లో ప్రతిభ చూపిన జాహ్నవి



కూచిపూడిలో బహుమతి అందుకుంటున్న విద్యార్థిని జాహ్నవి

కీసర: కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన డార్జిలింగ్‌లో జాతీయ 8వ నృత్య, సంగీత చాంపియన్‌షిప్–2025 జరిగింది. ఈ పోటీల్లో నాగారం సెరినిటీ మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థిని బి.జాహ్నవి కూచిపూడి నృత్యంలో ద్వితీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ నోముల జంగిరెడ్డి విద్యార్థిని శాలువాతో సత్కరించి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పోచారం: రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలైన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లాపూర్‌కు చెందిన మినుముల సాయికిరణ్(25) 3న మధ్యాహ్నం ఉప్పల్ నుంచి ఘట్‌కేసర్‌కు బైక్‌మీద వెళ్తున్నాడు. ఈ క్రమంలో అన్నోజిగూడలోని అనంద్ అపార్ట్‌మెంట్స్ వద్దకు రాగానే ముందువెళ్తున్న ఆటో ఒక్కసారిగా ఎడమ పక్క నుంచి కుడి పక్కకు రావడంతో ఆటోను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాయికిరణ్ గాయపడటంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.


ప్రభుత్వ ఆస్పత్రిలో సమస్యలను పరిష్కరించాలి



ఆస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మేడ్చల్: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న అన్ని సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం డిమాండ్ చేశారు. మండల సీపీఎం నాయకులతో కలిసి ఆయన మంగళవారం ఆస్పత్రిని సందర్శించి సమస్యలను తెలుసుకుని వైద్యులతో మాట్లాడారు. ఆస్పత్రిలో ప్రధానంగా భవనం సమస్య ఉందని నిర్మాణంలో ఉన్న భవనం త్వరగా పూర్తిచేయాలని అన్నారు. వైద్యుల కొరత అధికంగా ఉందని డాక్టర్లను నియమించాలని కోరారు. ఏడుగురు డాక్టర్లు డిప్యుటేషన్‌పై పని చేస్తున్నారని, 5మంది నర్సులే ఉన్నారని, ఆస్పత్రిలో ఆధ్వాన్న డ్రైనేజీతో పారిశుద్ధ్య సమస్య నెలకొందన్నారు. ఈనెల 12వ తేదీన ప్రభుత్వ ఆస్పత్రుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని సమస్యలను ప్రస్తావిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల సీపీఎం కార్యదర్శి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

కీసర బీజేపీ అధ్యక్షుడిగా బాలరాజుయాదవ్



కీసర: బీజేపీ కీసర మండల నూతన అధ్యక్షుడిగా బాలరాజుయాదవ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రారెడ్డి మంగళవారం బాలరాజుయాదవ్‌ను కలిసి శాలువాతో సత్కరించారు. శ్రీనివాస్‌గౌడ్, బి.శ్రీనివాస్, నరేష్ తదితరులున్నారు.